క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని సెస్ ఏఈ మధుకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు శాంతినగర్, రాళ్ళబావి, మోహర్‌నగర్, వేంకటేశ్వర ఆలయ ఏరియా, రెడ్డివాడ తదితర ప్రాంతాల్లో ఉండదన్నారు.

నేడు గుర్తింపు కార్డుల అందజేత

ముస్తాబాద్: ఓటరు జాబితాలో కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఎపిక్ కార్డులను పంపిణీ చేస్తామని పోస్టు మాస్టర్ నితిన్ తెలిపారు. ముస్తాబాద్ పట్టణంలో 400 మంది యువకులకు నూతన ఓటర్ ఐడీ కార్డులు వచ్చాయన్నారు. వీరందరికి ముస్తాబాద్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం అందజేస్తామన్నారు.

ఓటరు నమోదుకు మరో రెండు రోజులు



మాట్లాడుతున్న శంకరమ్మ

చందుర్తి: ఓటరు నమోదుకు ఈనెల 30 వరకు మాత్రమే గడువుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ తెలిపారు. చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదుపై బీఎల్‌వోల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండినవారు ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రక్షణ చట్టాల గురించి తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం ఏఎస్సై ప్రమీల

కోనరావుపేట: బాలికలు రక్షణ చట్టాల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని షీటీం ఏఎస్సై ఎస్.ప్రమీల అన్నారు. కొలనూర్‌లోని మార్గదర్శి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టోల్‌ఫ్రీ నెంబర్ 100కు గానీ, వాట్సాప్ నెంబర్ 8712656425కు సమాచారం ఇస్తే వెంటనే వచ్చి సహాయాన్ని అందిస్తామన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మండల చిరంజీవి, ఉపాధ్యాయులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

వీరునితండాలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రుద్రంగి: వీరునితండా గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రభుత్వ వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వీరునితండా యువకులు చందుర్తి వైద్యుడు సంపత్‌ను కోరారు. శనివారం వీరునితండా గ్రామంలో ప్రభుత్వ వైద్యులు వైద్యశిబిరం నిర్వహించారు. గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుడికి ఘన నివాళి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయ బృందం

వీర్నపల్లి: రంగంపేట గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఉపాధ్యాయుడు, టీఎస్‌టీటీఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య మోహన్ సంతాప సభను టీఎస్‌టీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మోహన్ విద్యారంగానికి చేసిన కృషిని కొనియాడారు. టీఎస్‌టీటీఎఫ్ నాయకులు శర్మన్, హజునాయక్, మదన్‌లాల్, మోతిలాల్, రాందాస్, తిరుపతి, కర్తిలాల్, జలపతి, ఉపాధ్యాయులు తుమ్మల శ్రీనివాస్, గజన్, రఘుపతి, శ్రీనివాస్, ప్రవీణ్, తిరుపతి, అరవింద్, జోత్స్న, మానసవీణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఒట్టుతో ఓటు పడేనా..?



బీఆర్ఎస్‌కు ఓటేస్తామని ప్రమాణం చేస్తున్న సంఘ సభ్యులు



కాంగ్రెస్‌కు ఓటేస్తామని ప్రమాణం చేస్తున్న సంఘ సభ్యులు

- కుల సంఘాల తీర్మానాలు
- గెలిస్తే అభివృద్ధికి నేతల హామీలు
- నియోజకవర్గంలో జోరుగా చర్చ

వేములవాడరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటు దక్కించుకునేందుకు పాట్లు పడుతున్నారు. గ్రామాల్లో కుల సంఘాల సభ్యులతో తమకే ఓటేయాలంటూ ప్రమాణం చేయిస్తూ తీర్మానాలు చేస్తున్నారు. దీనిపై నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది. జోరుమీదున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు చేస్తూ ఓటు అడిగే విధానం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తాము గెలిస్తే కుల సంఘాల భవనాలతో పాటు ఆయా వర్గాల దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీలిస్తున్నారు. ఓటేయడాన్ని ముందుగానే ప్రకటించే విధానం సరికాదని పలువురు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తీర్మానం చేస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ నిబంధనల సమయంలో అధికారులు ఎలాంటి చర్యలకు వెళ్తారో వేచి చూడాల్సిందే మరి. ఏది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో మాత్రం రెండు పార్టీల మధ్య ప్రచారం రోజురోజుకు ఊపందుకుంటోంది.

బీఆర్ఎస్ ప్రచారం



ఎల్లారెడ్డిపేట: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గోరింటాలలో మేనిఫెస్టో ప్రతులు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు కోరారు. రాచర్ల తిమ్మాపూర్, గుండారం, బాకూర్‌పల్లి, కృష్ణనాయక్ తండాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సుభాష్, మల్లారెడ్డి, రమేశ్, శ్రీనివాస్, కిషన్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదలకు అండగా మేనిఫెస్టో

గంభీరావుపేట: సీఎం కేసీఆర్ పేదలకు అండగా ఉండేందుకు మేనిఫెస్టోను రూపొందించారని, కేసీఆర్ పాలనలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని గంభీరావుపేట ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ అన్నారు. గోరింటాల, గజసింగవరం, సముద్రలింగాపూర్, తుర్కాశిపల్లె గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు మంత్రి కేటీఆర్ తరఫున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, ఎంపీటీసీ అంజిరెడ్డి, అంజమ్మ, రాజిరెడ్డి, బాలరాజు, రాజేందర్, హన్మంతరెడ్డి, లింగంయాదవ్, నరేందర్, కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్ రెడ్డి, దయాకర్‌రావు, రాజరాం, వెంకటేష్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగిలో జోరుగా ప్రచారం

రుద్రంగి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం బీఆర్ఎస్ నాయకులతో కలిసి గడప గడప తిరిగారు.



ప్రచారం చేస్తున్న రుద్రంగి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకులు



కోనరావుపేట: బీఆర్ఎస్‌లో చేరిన మర్తనపేట గ్రామస్తులు

చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించాలని కోరారు. కోఆప్షన్ సభ్యుడు జెమీలా బేగం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటె రెడ్డి, నాయకులు నర్సారెడ్డి, నర్సయ్య, నారాయణ, చంద్రయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కోనరావుపేట: మర్తనపేట గ్రామానికి చెందిన 20 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. బూత్ అధ్యక్షుడు జవ్వాజి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేరగా.. వారికి చల్మెడ లక్ష్మీనర్సింహారావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తన విజయానికి కృషి చేయాలని కోరారు. గడ్డం వెంకటేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, మహేశ్, మల్లయ్య, విజయ్, సందీప్, ఎల్లారెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

వేములవాడరూరల్: వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు ఓటేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోచెట్టిపల్లి, నాగాయపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రొండి రాజు, కరుణాకర్, చిలుక ప్రభాకర్, సంఘ స్వామి, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, శంకర్, రవీందర్, సురేష్, గోపాల్, కొండయ్య, విష్ణు, అర్జున్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్కపేటలో..

కోనరావుపేట: మల్కపేటలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు కర్రోల్ల భాస్కర్, తాళ్లపెల్లి ప్రభాకర్, కుంట శ్రీనివాస్, అతికం శ్రీనివాస్, కాశీరాం, కమలాకర్, కుంట వెంకటేశ్, జంగిటి లక్ష్మణ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



పోచెట్టిపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించాలి

తంగళ్లపల్లి: ఓటేయాలని వచ్చే బీఆర్ఎస్ నాయకులను ప్రజలు ప్రశ్నించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వైద్య శివప్రసాద్ కోరారు. పద్మనగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వివరిస్తూ ప్రచారం చేశారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు నేరెళ్ల నర్సింగంగౌడ్, మునిగెల రాజు, అరెపల్లి బాలు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మల్కపేటలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కాంగ్రెస్ గెలిస్తే ఊరికి లాభం

- పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఊరికి లాభం అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దుమాలలో శనివారం పసుల కృష్ణ ఆధ్వర్యంలో రజక సంఘం సభ్యులు, మహిళలు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలిస్తే గ్రామీణులకు న్యాయం జరుగుతుంద, బీఆర్ఎస్ గెలిస్తే కేటీఆర్ అనుచరులు నలుగురికి మాత్రమే లాభం జరుగుతుందన్నారు. ఆరు గ్యారంటీ కార్డులతో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ఎల్లారెడ్డిపేటలో బింగి మల్లేశం ఆధ్వర్యంలో 20 మంది కురుమలు పార్టీలో చేరారు. నాయకులు రాజు, బోనాల రవి, మొగుళ్ల మధు, అనవేని రవి, సతీశ్, సత్తయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, గంట బుచ్చాగౌడ్, అంజాగౌడ్, చెన్నిబాబు, రాజునాయక్, సూడిద రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

చల్మెడ గెలవాలని కనకదుర్గకు మొక్కులు



విజయవాడ కనకదుర్గ ఆలయం ముందు ప్రసాద్

కోనరావుపేట: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలవాలని కోరుతూ బీఆర్ఎస్ యూత్ నాయకుడు జవ్వాజి ప్రసాద్ విజయవాడలోని కనకదుర్గ ఆలయంలో మొక్కుకున్నారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఉమామహేశ్వర ఉత్సవ మూర్తులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని శ్రీశివకేశవుల ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం జరిగాయి. ఉదయం గణపతి హోమం, బలిహరణం చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయాలను మూసేశారు. చంద్రగ్రహణం దృష్ట్యా ఆలయాల తలుపులను మూశామని అర్చకుడు హరీశ్‌శర్మ తెలిపారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం రాత్రి స్వామివార్ల రథోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దేవయ్యయాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతం చేయాలి



సిరిసిల్లఅర్బన్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు



ఎల్లారెడ్డిపేట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: పట్టణంలో నవంబర్ 1న బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే సిరిసిల్ల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ అభ్యర్థి పిట్టల భూమేష్ పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో సభకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, సిరిసిల్ల నియోజవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మధుకర్, పెద్దన్న, దివ్యభారతి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

గంభీరావుపేట: నవంబర్ 1న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సిరిసిల్ల సింహగర్జన బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు కర్రొల్ల రాజు కోరారు. నాయకులు పర్శరాములు, ఉపేంద్ర, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేద్దాం

ఎల్లారెడ్డిపేట: జిల్లా కేంద్రంలో నవంబర్ 1న నిర్వహించే సింహగర్జనను విజయవంతం చేయాలని బీఎస్పీ మండల ఇన్‌చార్జి సందీప్ కోరారు. ఈమేరకు మండల కేంద్రంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వస్తున్నారని, సభను విజయవంతం చేయాలని కోరారు. సిరిసిల్ల నుంచి ముదిరాజు బిడ్డ, న్యాయవాది పిట్టల భూమేశ్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు అందె శ్రీనివాస్, కొప్పెల్లి రాజు, అందె ఈశ్వర్, బొడ్డు కిషన్, సయ్యద్ కరీం, గడ్డమీది సాయిచంద్, లింగాల నిలేశ్, అందె మహేశ్, కరుణాకర్, నిమ్మపల్లి రాజ్‌కుమార్, అందె బాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహా అన్నదానం



వడ్డిస్తున్న జిందం కళ, గూడూరి ప్రవీణ్



అన్నదానం ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని జగదాంబ మండపాల్లో శనివారం మహాన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ తదితరులు ముఖ్య అతిథులు హాజరై సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మూడో వార్డులో చైర్‌పర్సన్ దంపతులు జిందం కళ-చక్రపాణి, 17వ వార్డులో కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ-పూర్ణచందర్, 37వ వార్డులో కౌన్సిలర్ దిడ్డి మాధవి-రాజు, 22, 33 వార్డుల్లోని జగదాంబ మండపాల్లో అన్నదానాలు నిర్వహించగా.. ప్రముఖులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: మండలంలో దుర్గాదేవి మండపాల్లో పూజలు ముగిశాయి. ప్రతిమలను నిమజ్జనం చేశారు. జగదాంబ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. డీఎక్స్ యూత్ మండపంలో పూజలందుకున్న అమ్మవారి ప్రతిమను స్థానిక మహిళలు శోభాయాత్రగా తీసుకెళ్లి మార్కండేయ ఆలయంలో ప్రతిష్ఠించారు. వార్డు సభ్యులు అంకారపు లక్ష్మీ వైకుంఠం, అంకారపు మహేష్, పడిగెల అనిల్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ స్థల చదునుపై విచారణ

ముస్తాబాద్: నామాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం చేపట్టిన చదును పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శనివారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు ఎంపీవో ఆరీఫ్ తెలిపారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.2.29లక్షలను స్థలాన్ని చదును చేసేందుకు వినియోగించారని, ఇందులో జేసీబీ పని గంటల్లో చాలా వ్యత్యాసముందని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. పంచాయతీలో రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేశామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కేటాయించిన స్థలంలో రూ.20వేల విలువైన పనులు కూడా జరగలేదని ఎంపీవోకు తెలిపామని యువకులు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.2లక్షలకు పైగా ప్రజా నిధులను పక్కదారి పట్టించారని యువకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అందరి వివరాలను నమోదు చేసి జిల్లా అధికారులకు నివేదిస్తామని ఎంపీవో తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూం స్థలం పరిశీలిస్తున్న ఆరిఫ్

వాల్మీకి జయంతి వేడుకలు

గంభీరావుపేట: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలేసి ఆయన జీవిత చరిత్రను గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, సంఘం అధ్యక్షుడు మాండ్ల బాలయ్య, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, వార్డు సభ్యుడు రాజిరెడ్డి, వాల్మీకి సంఘం ప్రతినిధులు దన్నపు నారాయణ, పెంటయ్య, రవి, స్వామి, లక్ష్మణ్, లింగం, బాలరాజు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

రుద్రంగి: మండల కేంద్రంలో బోయ వాల్మీకి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలేసి ఘన నివాళి అర్పించారు.



గంభీరావుపేట: పాల్గొన్న సర్పంచ్, బోయ వాల్మీకీలు

నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని గొల్లపల్లి శివారులో శనివారం బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. లింగన్నపేటకు చెందిన పార్వతి మహేశ్, భూమక్క, పర్శరాంరెడ్డి, దమ్మన్నపేటకు చెందిన భాగిరెడ్డి మధురెడ్డి, మాచారెడ్డికి చెందిన భూక్య ధర్‌సింగ్‌పై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎక్సైజ్ సిబ్బంది కిశోర్‌కుమార్, కృష్ణకాంత్, రాజేందర్, మల్లేశ్, సర్దార్ అలీ, దివ్య పాల్గొన్నారు.

రేపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముస్తాబాద్: పోతుగల్ పరిధిలోని పది కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించనున్నట్లు చైర్మన్ తన్నీరు బాపురావు తెలిపారు. వానాకాలం పంటలు ముందస్తుగా కోతలకు రావడంతో.. కేంద్రాల ఏర్పాటులో కొంత ఆలస్యం జరిగిందన్నారు. సింగిల్‌విండో పరిధిలోని పది గ్రామాల్లో ఒకేసారి కేంద్రాలను ప్రారంభిస్తామని, జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రాల ప్రారంభానికి అనుమతులిచ్చారని అన్నారు. ఈసారి కొత్తగా తెర్లుమద్ది గ్రామంలో సింగిల్‌విండో కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఇక్కడ ఇప్పటి వరకు ఐకేపీ కేంద్రం ఉండగా.. దాన్ని వారు ఎత్తేసిన నేపథ్యంలో పీఏసీఎస్ ద్వారా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించొద్దని, ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ఎల్లారెడ్డిపేట: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీజేపీ నాయకులు శనివారం సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తికి వినతి పత్రం అందించారు. వరి ధాన్యం దళారులపాలు కాకుండా చూడాలని కోరారు. వరి కోతలు చేపట్టి పక్షం రోజులవుతున్నా ఇంకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. దళారులు తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. బీజేపీ గొల్లపల్లి శాఖ నాయకులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు